


8న రామేశ్వరం కెఫె పునఃప్రారంభం

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న శివరాత్రి రోజున రామేశ్వరం కెఫెను పునఃప్రారంభిస్తామని సంస్థ డైరెక్టర్‌లు దివ్యరావు, రాఘవేంద్ర రావు ఆదివారం ప్రకటించారు. పేలుళ్లలో గాయపడ్డ బాధితులు క్రమేపీ కోలుకుని డిశ్చార్జ్ అవుతున్నారన్నారు.బ్రూక్‌ఫీల్డ్ కెఫె శాఖలో బాంబు పేలుళ్ల సంఘటన బాధాకరమన్నారు. దర్యాప్తు సంస్థలకు సంపూర్ణంగా సహకారం అందిస్తామన్నారు. బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి అవసరమైన సాయం చేసేందుకు సిద్ధమన్నారు. బాంబుపేలుళ్లు జరిగిన వెంటనే పోలీసులకు అవసరమైన సీసీటీవీ ఫుటేజీలను అప్పగించామన్నారు.

నీటి సంరక్షణలో నిర్లక్ష్యం...!







వాన నీటిని ఒడిసి పట్టే విధానం

- నగరంలో 20శాతం ఇళ్లకే వర్షపునీటి సేకరణ ఏర్పాట్లు
- 15 ఏళ్లక్రితమే తప్పనిసరి నిబంధనలు.. అయినా అమలు శూన్యం..
- వృథా అవుతున్న జలం.. ఏటా తాగునీటికి తప్పని తిప్పలు
- జనం మారకపోతే నీటి కష్టాలు తప్పవంటున్న జల నిపుణులు

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏటా తాగునీటికి తిప్పలు పడుతున్నా వర్షపునీటిని ఒడిసి పట్టుకోవడంలో అదే నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాన నీటిని సద్వినియోగం చేసుకునే ప్రక్రియను అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. నగర ప్రజలు వర్షపునీటిని నిల్వపై ఆసక్తి చూపడం లేదు. 15ఏళ్లక్రితమే బెంగళూరు వ్యాప్తంగా ప్రతి ఇంటికీ వర్షపునీటి సేకరణ ప్రక్రియను తప్పనిసరి చేశారు. పాటించకపోతే ప్రభుత్వ సౌలభ్యాలను నియంత్రిస్తామనే హెచ్చరికలు చేశారు. అయితే ఇప్పటివరకు నగరంలో 20 శాతం ఇళ్లకు మాత్రమే వర్షపునీటి సేకరణ ప్రక్రియ అమలులో ఉంది. నగరంలో ఏటా సరాసరిన 970 మి.మీ వర్షం కురుస్తుంది. ఈ నీరంతా వృథాగా వెళ్లిపోతుంది. కానీ బెంగళూరుకు తాగు, ఇతర అవసరాలకోసం వందల కిలోమీటర్ల నుంచి సరఫరా చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. బెంగళూరు జలమండలి ఏటా నీటి అవసరాలకోసమే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. వర్షపునీటిని నిల్వ ఉంచుకోవడం ద్వారా అవసరాలకు ఉపయోగించుకునే వీలుంటుంది. బోరుబావులతోపాటు నీటి మూలాలు ఎండిపోతున్నాయి. చుక్కనీటికోసం పరితపించాల్సి వస్తోంది.

అద్దెకు ట్యాంకర్లు...

నగరంలో అత్యవసరంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు జలమండలి, బీబీఎంపీ 200 ట్యాంకర్లను అద్దెకు తీసుకుంది. నీటి సమస్య ఉండే ప్రాంతాలకు సరఫరా చేయనుంది. కొత్తగా బోర్లుతవ్వేందుకు కోట్లాది రూపాయలు సిద్ధం చేసుకుంటున్నారు. వీటన్నింటికీ వర్షపునీటిని వ్యవస్థీకృతంగా సద్వినియోగం చేసుకోకపోవడమే కారణంగా తెలుస్తోంది. నగరంలో సుమారు 20లక్షలకు పైగా ఇళ్లు ఉన్నాయి. వీటిలో 10.84 లక్షల ఇళ్లకు జలమండలి ద్వారా నీరు సరఫరా అవుతోంది. వీటిలో 1,95,771 ఇళ్లకు మాత్రమే వర్షపునీటి సేకరణ అమలులో ఉంది. నగరవ్యాప్తంగా 2009లోనే వర్షపునీటి సేకరణ తప్పనిసరి చేశారు. 40/60 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకున్న ఇళ్లకు వర్షపునీటి సేకరణ తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. ఒకవేళ పాటించకపోతే ప్రతినెలా జలమండలి ద్వారా నీటిబిల్లుకు 50శాతం అదనంగా జరిమానా విధించే నిబంధన ఉంది. ఇలా నగరంలో 40వేలమంది అదనపు జరిమానా చెల్లిస్తున్నారు. వీటిద్వారానే జలమండలికి ప్రతి నెలా రూ.2కోట్లకుపైగా అందుతోంది. జలమండలి అధికారులు వర్షపు నీటి సంరక్షణ విధానం అమలు చేయనివారిని పక్కాగా సర్వే జరిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. బెంగళూరులో ఏటా 970 మిమీ వర్షం కురుస్తుంది. 40/60 అడుగుల విస్తీర్ణంలోని ఇళ్లద్వారా వర్షపునీరు సేకరిస్తే ఏడాదికి కనీసం 2లక్షల లీటర్ల నీరు నిల్వకానుంది. నగరంలో ఒక వ్యక్తి రోజుకు 135 లీటర్ల నీటిని వినియోగిస్తాడు. ఈ లెక్కప్రకారం నలుగురు సభ్యులు ఉండే కుటుంబంలో ఏడాది పొడవునా వర్షపునీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నగరంలో సాధారణంగా జనవరి, ఫిబ్రవరి, డిసెంబరు నెలల్లో వర్షం అంతంతమాత్రమే ఉంటుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కనీసం 5-8రోజులు వర్షం కురుస్తుంది. జూన్ నుంచి సెప్టెంబరు దాకా కనీసంగా 15రోజులకుపైగానే వర్షం కురిసే అవకాశం ఉంది. అక్టోబరు, నవంబరులలో 10రోజులలోపు వర్షం కురవనుంది. మొత్తంగా ఏడాదిలో 55-60 రోజులకుపైగా వర్షం కురిసే అవకాశం ఉంది. ప్రజల్లో చైతన్యం పెరిగి నీటిని కాపాడుకుంటే నీటి కష్టాలు తీరుతాయని జలనిపుణులు సూచిస్తున్నారు.





మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

ట్యాంకర్ల మాఫియాకు అడ్డుకట్ట : డీకే

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్యాంకర్ల మాఫియాకు అడ్డుకట్ట వేస్తామని డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. నీటి సమస్య తీవ్రమవుతున్న తరుణంలో ప్రైవేట్ బోర్లు, ట్యాంకర్లను బీబీఎంపీ ద్వారా స్వాధీనం చేసుకుని నీటిని సరఫరా చేయదలిచినట్లు బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి, డీసీఎం డీకే తెలిపారు. బెంగళూరులో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ ఏడాది వర్షాభావం కారణంగా ప్రాజెక్టులకు నీరు చేరలేదన్నారు. ఈ ప్రభావం బెంగళూరు నగరంపైనా చూపుతోందన్నారు. నీటి సమస్య కారణంగా ట్యాంకర్ల మాఫియా దందాకు అవకాశం ఇచ్చేది లేదన్నారు. బెంగళూరు పరిధిలోని అన్ని నియోజకవర్గాలపైనా నిఘా పెట్టామన్నారు. బీబీఎంపీ ప్రత్యేక నిధులను ఉపయోగించుకుని తాగునీటిని సమకూరుస్తామన్నారు. బీబీఎంపీ అధికారులు ఇప్పటికే ట్యాంకర్లు, బోరుబావులను గుర్తిస్తున్నామన్నారు. నమోదు చేసుకునేందుకు వారం రోజులు వ్యవధి ఉంటుందన్నారు. పోలీసులు, ఆర్టీఓ అధికారులు నమోదు చేసుకునేందుకు సహకరిస్తారన్నారు. ఆ తర్వాత వాటిని స్వాధీనం చేసుకుని బీబీఎంపీ ద్వారా సరఫరా చేస్తామన్నారు. ప్రతిరోజూ బీబీఎంపీ కమిషనర్ సమీక్ష చేస్తారన్నారు. ఈనెల 7వ తేదీలోగా ప్రైవేట్‌బోర్లు, ట్యాంకర్ల నిర్వాహకులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత నీటి సమస్య ఉండే ప్రాంతాలకు ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా సరఫరా చేస్తామన్నారు.





బీజేపీ రెబల్ ఎమ్మెల్యేలకు నోటీసులు

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రెబల్ ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీజులు జారీ చేశారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించి రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసిన ఎస్‌టీ సోమశేఖర్, పోలింగ్‌కు గైర్హాజరైన శివరాం హెబ్బార్‌లకు బీజేపీ చీఫ్ విప్ దొడ్డణ గౌడ పాటిల్ ఆదివారం నోటీసులు జారీ చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఎస్‌టీ సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. ఆత్మాభిమానం మేరకు ఓటు వేశానని ఆయన బహిరంగంగా ప్రకటించారు. ఇక శివరాం హెబ్బార్ చివరిక్షణం దాకా ఓటు వేసేందుకు వస్తారని భావించినా గైర్హాజరయ్యారు. అయితే ఆరోగ్యం బాగలేదని వివరణ ఇచ్చారు. ఇలా ఇద్దరూ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారు. తొలుత వీరిపై చర్యలకు పార్టీ నాయకులు వెనుకడుగు వేశారు. అయితే హిమాచల్‌ప్రదేశ్‌లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడంతో ఇక్కడా అదే విధానం అమలు చేయాలని రాష్ట్ర పార్టీ నేతలు తీర్మానించారు. ఇందుకు అనుగుణంగానే స్పీకర్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలనూ అనర్హులుగా ప్రకటించాలని మూడు పేజీలతో నోటీసులు జారీ చేశారు. ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. బీజేపీ నుంచి గెలుపొంది కాంగ్రెస్ అభ్యర్థికి ఎస్‌టీ సోమశేఖర్ ఓటు వేయడం, శివరాం హెబ్బార్ గైర్హాజరు కావడంపై ఎందుకు చర్యలు తీసుకోరాదని ప్రశ్నించారు. ఎన్నికల రోజున నిరంతరంగా ఫోన్‌కు ప్రయత్నించినా స్పందించలేదని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలకు వాట్సప్ ద్వారా నోటీసు జారీ చేశారు. ఎస్‌టీ సోమశేఖర్ సత్తా ఉంటే తమపై వేటు వేయాలని చేసిన సవాల్‌ను రాష్ట్ర పార్టీ తీవ్రంగా పరిగణించింది.

10 లోగానే కాంగ్రెస్ తొలిజాబితా



బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈనెల 10లోగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ వారంలోనే సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఢిల్లీ వెళ్లనున్నారు. ఇప్పటికే కేపీసీసీలో ఖరారైన జాబితాను కాంగ్రెస్ ఎన్నికల కమిటీకి పంపారు. ఢిల్లీ వెళ్లిన ఇదే జాబితాను ఖరారు చేసే అవకాశం ఉంది. తొలి విడతలో 10-12 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి పార్టీ వర్గాల ద్వారా తెలుస్తున్న మేరకు మైసూరు నుంచి లక్ష్మణ్ లేదా యతీంద్ర సిద్దరామయ్య, మండ్య నుంచి స్టార్ చంద్రు, తుమకూరు - ముద్ద హనుమేగౌడ లేదా డీసీ శంకర్, కోలారు - మునియప్ప, చిత్రదుర్గ - చంద్రప్ప, ఉడుపి-చిక్కమగళూరు - జయప్రకాశ్ హెగ్డే, బెంగళూరు గ్రామీణ - డీకే సురేశ్, బెంగళూరు సెంట్రల్ - రిజ్వాన్ హర్షద్ లేదా టబు గుండూరావు, బెంగళూరు ఉత్తర - కుసుమ హనుమంతరాయప్ప, బెంగళూరు దక్షిణ - సౌమ్యరెడ్డి, ఉత్తరకన్నడ - అంజలి నింబాల్కర్, చిక్కబళ్లాపుర - వీరప్పమొయిలీ లేదా రక్షా రామయ్యలుగా ఉన్నాయి. చిక్కబళ్లాపుర నుంచి బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే బచ్చేగౌడ కోడలు, ఎమ్మెల్యే శరత్ భార్య ప్రతిభా శరత్ పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది. బచ్చేగౌడ ఇటీవల కొంతకాలంగా కాంగ్రెస్‌తో చనువుగా ఉంటున్నారు. ఆయన కుమారుడు శరత్ ప్రస్తుతం హొస్కోటె కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న సంగతి తెలిసిందే.

అంధురాలికి బంగారు.. అనాథకు పది పతకాలు



అంధ విద్యార్థిని అనఘకు బంగారు పతకం



పది బంగారు పతకాలతో అనాథ విద్యార్థి తేజస్విని

- ఎస్‌ఎం కృష్ణ సహా నలుగురికి గౌరవ డాక్టరేట్
- ఎంఆర్ సీతారాం, శ్రీనాథ్‌కు కూడా...
- ఘనంగా మైసూరు యూనివర్సిటీ స్నాతకోత్సవం

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విధి వెక్కిరించినా ప్రతిభ చాటారా విద్యార్థులు. అంధురాలైనా బంగారు పతకం సాధించి అనఘ ప్రతిభ చాటితే..తల్లిదండ్రులను కోల్పోయినా మనోధైర్యంతో తేజస్విని పది బంగారు పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంది. మైసూరు యూనివర్సిటీ 104వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన నలుగురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ, సుదర్శన నరసింహ సంస్థ పీఠాధిపతి భాష్యం స్వామిజీ, బెంగళూరు గోకుల ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షులు ఎంఆర్ సీతారాం, మాజీ క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్‌లకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. మానసగంగోత్రి క్రాఫర్డ్ భవనంలో ఏర్పాటైన స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ముఖ్యులుగా పాల్గొన్నారు. 103వ స్నాతకోత్సవంలో జవగళ్ శ్రీనాథ్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు. అప్పట్లో ఆయన హాజరు కానందున ప్రస్తుత స్నాతకోత్సవంలో ప్రదానం చేశారు. హృద్రోగ నిపుణుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఉన్నత విద్యా శాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, వీసీ ప్రొఫెసర్ ఎన్‌కే లోకనాథ్, రిజిస్ట్రార్‌లు వీఆర్ శైలజ, ప్రొఫెసర్ కే మహదేవన్‌లు పాల్గొన్నారు. 32,249మంది అభ్యర్థులకు పట్టాలను ప్రదానం చేశారు. వీరిలో 19,992మంది మహిళలు కాగా 61.99శాతంమంది ఉన్నారు. 45మంది మహిళలు, 55మంది పురుషులకు 100 పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. డిగ్రీ, పీజీలలో 252మందికి 436 బంగారు పతకాలు, 266మందికి నగదు బహుమతి అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయి హాస్టళ్లలో చదువుకున్న తబ్బ శి బాలిక తేజస్వినికి ఎంఏ కన్నడలో 10 బంగారు పతకాలు, నాలుగు నగదు బహుమతులు దక్కాయి. కొళ్ళేగాళ తాలూకా సత్తెగాల గ్రామానికి చెందిన తేజస్వినికి నాల్గో తరగతిలో ఉండగా తల్లి నాగమ్మ, ద్వితీయ పీయూ పరీక్షల వేళ తండ్రి వెంకటేశ్‌లు మృతి చెందారు. ఉన్నత విద్య చదవాలనే లక్ష్యంతో ఉన్న తేజస్వినిని ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రోత్సహించారు. పుట్టుకతో అంధురాలైన ఎస్ అనఘ ఎంఏ కన్నడలో బంగారు పతకాన్ని సాధించారు. శాస్త్రీయ సంగీతంలో సీనియర్ పరీక్షల్లో వాసు అనే విద్యార్థి విద్వత్ పురస్కారం పొందారు.



గౌరవడాక్టరేట్‌ల ప్రదానంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తదితరులు

పేలుళ్ల బాధితుల్లో కంటి సమస్య

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల సంఘటనలో గాయపడ్డ 9మందిలో ఒకరికి కంటి సమస్య తీవ్రమైనట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం మరో ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. మిగిలినవారికి చికిత్స కొనసాగుతున్నాయి. వైదేహి ఆసుపత్రితోపాటు బ్రూక్‌ఫీల్డ్ ఆసుపత్రిలో బాధితులు చికిత్స పొందుతున్నారు. నాగశ్రీ అనే మహిళ కంటికి తీవ్రమైన గాయాలు తగలడంతో దృష్టి సమస్య వచ్చే అవకాశం ఉందని వైదేహి ఆసుపత్రుల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా తెలిపారు. సాధారణ చూపు వచ్చేలా డాక్టర్లు ప్రయత్నిస్తున్నారన్నారు. శ్రీనివాస్, మోహన్‌లు డిశ్చార్జ్ అయ్యారని మరో ఇద్దరిని రెండు మూ డు రోజుల్లోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. ఇక బ్రూక్‌ఫీల్డ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపాంశు కోలుకోవడంతో శనివారం డిశ్చార్జ్ చేశారు. ఆమె చెవికి గాయాలు తగిలాయి. బ్రూక్‌ఫీల్డ్ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ దీపాంశు చెవికి దెబ్బ తగిలిందని రక్తం గడ్డ కట్టడంతో చికిత్స చేశామన్నారు. స్వర్ణాంబ, ఫరూక్‌లకు చికిత్స కొనసాగుతుందన్నారు. స్వర్ణాంబకు ప్లాస్టిక్ సర్జరీ చేశామన్నారు. ఇంకా ఐసీయూలో చికిత్స కొనసాగుతున్నాయన్నారు. స్వర్ణాంబ భర్త శ్యామసుందర్ మాట్లాడుతూ ఎటువంటి తప్పు చేయకున్నా బాధలు పడుతున్నామని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పోలియో రహిత రాష్ట్రమే లక్ష్యం






విజయనగర జిల్లాలో పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న సీఎం సిద్దరామయ్య

బళ్లారి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పోలియో రహితంగా మారుస్తామని, తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం వహించరాదని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆదివారం విజయనగర జిల్లా లోని హంపీ సమీపంలోని కమలాపురం గ్రామంలో పల్స్‌పోలియో కార్యక్రమంలో సీఎం సిద్ద రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పోలియోరహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందన్నారు. రామేశ్వర కేఫ్ వద్ద జరిగిన బాంబు పేలుళ్ల కేసును నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్‌ఐఏ)కు అప్పగిస్తామన్నారు. దోషులను వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు. విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలపై ప్రశ్నించగా దర్యాప్తు కొనసాగుతోందని నిందితులపై చర్యలు తప్పవన్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు నాగేంద్ర, జమీర్ అహమ్మద్, ఎమ్మెల్యే గవియప్ప, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి జాతీయ ఉద్యానమేళా

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హెసరఘట్టలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్‌ఆర్) ఆధ్వర్యంలో జాతీయ ఉద్యానమేళా 2024 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. సుస్థిర అభివృద్ధి, ఆధునిక ఉద్యాన సాంకేతిక విధానాలు అనే అంశంపై మేళా జరగనుంది. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ కార్యదర్శి మనోజ్ అహూజా, అదనపు కార్యదర్శి సంజయ్‌గార్గ్, అపేడా అధ్యక్షుడు అభిషేక్‌దేవ్‌తోపాటు పలువురు పాల్గొననున్నారు. బిందుసేద్యం, ప్రకృతి వ్యవసాయంతోపాటు పలు అంశాలపై సమీక్షలు జరగనున్నాయి. ఐఐహెచ్‌ఆర్ రూపొందించిన అర్క భృంగరాజ్, కొడవ మిరపతోపాటు ఉల్లి నాటు యంత్రం, పుట్టగొడుగుల పెంపక విధానంపై ఆధునికత, తాజాపండ్లు కోసే యంత్రంతోపాటు మరిన్ని విభాగాల కొత్త పరికరాలు పరిచయం చేయనున్నారు. ఆన్‌లైన్‌లోనూ మేళాకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ 1967లో ప్రారంభించారు. సంస్థ ద్వారా పండ్లు, కూరగాయలు, అలంకరణ, ఔషధాలకు సంబంధించి 58 పంటలపై పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటివరకు 354 కొత్త వంగడాలను అభివృద్ధి చేశారు. 156 సాంకేతికతలను విడుదల చేశారు. 176 వాణిజ్య అవసరాలకు గాను రూపొందించారు. మూడు రోజులపాటు మేళా కొనసాగనుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.43	1,604.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	885	7,001
సామర్థ్యం (టీఎంసీలు)	8.29	27.35

6న చలో విధాన సౌధ

●సమస్యల పరిష్కారం కోసమే : ఎస్‌యూసీఐ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌యూసీఐ

బళ్లారి సిటీ, మార్చి 3: ప్రజాజీవితంలో జ్వలించే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 6న ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో చలో విధాన సౌధ నిర్వహిస్తున్నట్లు జిల్లాకార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఎస్‌యూసీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని ఫ్రీడం పార్కు వద్ద జరిగే నిరసనసభలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాది మంది ప్రజలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు, రాష్ట్ర కార్యదర్శి ఉమా ప్రసంగిస్తారని, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోరులో బళ్లారి నుంచి దాదాపు 500మంది పాల్గొననున్నారన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన ఉద్యోగులకు కేంద్రం కానీ రాష్ట్ర ప్రభుత్వం కానీ జీవించడానికి తగిన వేతనాలు , భద్రత కల్పించడం లేదన్నారు. ఈసమస్యల పరిష్కారానికై చలో బెంగళూరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెంగళూర్ చలో పోస్టర్లను విడుదల చేశారు. జగదీశ్, ఎస్‌యూసీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్లి సీఐగా ప్రకాష్ మాళిగి



కంప్లి, మార్చి 3 : ఎన్నికల సందర్భంగా కంప్లిలో సీఐగా విధులు నిర్వహిస్తున్న వాసుకుమార్ గంగావతి పట్టణానికి బదిలీ కాగా అక్కడున్న ప్రకాష్ మాళిగి కంప్లికు బదిలీపై వచ్చారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా తాము ఈ మూడు నెలల పాటు ప్రభుత్వం నిర్దేశించిన మేరకే విధులు నిర్వహిస్తామన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కంప్లి కోట వద్ద, ఉప్పరల్లి వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలపై నిఘా వుంచుతామని తెలిపారు. పాత బస్టాండు, కొత్త బస్టాండు, బళ్లారి బస్టాండు మూడు ప్రాంతాల్లో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సాయంత్రం వేళ సిబ్బందిని కూడా వుంచుతామని తెలిపారు. సంఘ సంస్థ నేతలు, నాయకులు, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

కాలువలో పడి ఒకరు మృతి

బళ్లారిరూరల్, మార్చి 3: తాలుకాలోని శివపురం కెనాల్ వద్ద గుంటూరు జిల్లా అగ్నిగుండల గ్రామానికి చెందిన అనంత నాగరాజు (28) ఆదివారం మూత్ర విసర్జన కోసం వెళ్లి కాలువలో పడి మృతి చెందినట్లు మోకా పోలీసులు తెలిపారు. అతడు తన స్నేహితులు అశోక్ శివకృష్ణ, అనంత్ రాజులతో కలిసి అశోక్ లేల్యాండ్ వాహనంలో వచ్చి మిర్చి పంటను మార్కెట్లో వేసి తిరిగి వెళుతుండగా శివపురం వద్ద ఈ సంఘటన జరిగినట్లు మోకా పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు..



చాకలి రాజు (ఫైల్)

బళ్లారిరూరల్, మార్చి 3 : బళ్లారి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద కర్నూలు జిల్లా అర్దగిరి గ్రామానికి చెందిన చాకలి చక్రపాణి కుమారుడు చాకలి రాజు (23) ట్రాక్టర్ ఢీ కొనడంతో మృతి చెందాడు. మోకా జయ మల్లికార్జున స్వామి మహా రథోత్సవానికి వస్తుండగా మొహం ఫారెస్టు వద్ద శనివారం సాయంత్రం అతడిని ట్రాక్టర్ ఢీకొంది. దీనిపై పీడీహళ్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జాతరకు వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చిన్నారులకు చాక్లెట్లు ఆశ చూపి..

పోలియో చుక్కలు వేసిన మంత్రి

బళ్లారి సిటీ, మార్చి 03: పిల్లలు మందు తాగేదిలేదని మొరాయిస్తే ఎవరైనా ఏం చేస్తారు? ఏ చాక్లెట్టో ఆశచూపిస్తారు. బహుశా పిల్లలతో ఆయనకు బాగా అనుభవం ఉందేమో బళ్లారి ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర కూడా సరిగ్గా అదే పనిచేశారు. బళ్లారి గాంధీనగర్‌లోని అయుష్మాన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సెంటర్‌కు వచ్చిన చిన్నారులకు చాకెట్లు పంపిణీ చేయడమే కాకుండా కేంద్రానికి వచ్చిన ప్రతి చిన్నారికి చాకెట్లు పంపిణీ చేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు చాక్లెట్ బాక్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పోరేషన్ సభ్యురాలు సురేఖ మల్లనగౌడ, జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా ఆర్‌సీ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి నాగేంద్ర

వాడవాడలా పల్స్ పోలియో



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న నగర మేయర్ బి.శ్వేత



పోలియో చుక్కలు వేస్తున్న సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారి జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. పలువురు ప్రముఖులు ఇందులో పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మహానగర కార్పోరేషన్ మేయర్ శ్వేత జిల్లావైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ఆస్పత్రి ఆవరణలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. పుట్టినప్పటి నుంచి 5ఏళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు వేయించడం ఎంతో అవసరమన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలనకు రెండు పోలియో చుక్కలు తప్పనిసరి అని అన్నారు.

గాంధీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా నగరపాలక సంస్థ సభ్యురాలు సురేఖ మల్లనగౌడ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి తదితరులు పాల్గొన్నారు. --- బళ్లారి సిటీ




కుడితినిలో పోలియో చుక్కలు వేస్తున్న రాజశేఖర్



సిరుగుప్పలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన డాక్టర్ ఈరణ్ణ

ఐదేళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిలో పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. తాలుకా వ్యాప్తంగా 186 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసి పిల్లలను కాపాడాలని కోరారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి అనారోగ్యానికి గురికాకుండా చూడాలని కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షులు వి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం రెండవ విడత పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా కుడితిని బస్టాండులో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అలాగే కంప్లి, కురుగోడు పట్టణాలలో కూడా పోలియో చుక్కలు వేశారు. 5వ వార్డులో కౌన్సిలర్ హాలప్ప పోలియో చుక్కలు వేశారు. --సిరుగుప్ప, కంప్లి



9 గంటలైనా కంప్లిలో ప్రారంభంకాని పల్స్ పోలియో కేంద్రం



కుడితిని 5వ వార్డులో హాలప్ప ఆధ్వర్యంలో..

గూడ్స్ ఆటోల్లో కూలీలను తరలిస్తే కఠిన చర్యలు

కంప్లి, మార్చి 3 : గూడ్స్ ఆటోల్లో మిరప పంటలకు కూలీలను తరలించినట్లయితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కుడితిని సీఐ విశ్వనాథ్ హిరేగౌడ తెలిపారు. కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలో గూడ్స్ ఆటో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అలాగే పరిమితికి మించి ఎక్కువ వేగంగా వెళ్లరాదని,గూడ్స్ ఆటోల్లో కేవలం సరుకులు, వస్తువులను మాత్రమే తరలించాలని తెలిపారు. 20-30 మందిని ఆటోలో ఎక్కించుకుని వెళితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జాగ్రత్తలు వహించకపోతే ప్రమాదాలు జరుగుతాయని ముందు జాగ్రత్తగా పరిమితి వేగంలోనే రవాణా చేపట్టాలని సూచించారు. వారితో పాటు క్రైమ్ ఎస్ఐ పాదవ్ జాతప్ప, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలూ అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాశాఖ సంయోజకుడు మారుతి

సిరుగుప్ప, మార్చి 3 : విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పాల్గొనాలని విద్యాశాఖ సంయోజకులు మారుతి తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో ఆదివారం బిస్మిల్లా ప్రాథమిక పాఠశాలలో 31వ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని మారుతి ప్రారంభించి మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. నేటి రోజుల్లో విద్యతో పాటు సాంస్కృతిక, ప్రతిభా కారంజి పోటీల్లో కూడా పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు షహనాజా బేగమ్, వలీ సాబ్, అబ్దుల్ నబీ, రహీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలతో సాగు నీటికి శాశ్వత పరిష్కారం

●రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు



అధికారులతో కలిసి గణేకల్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి భోసరాజు

రాయచూరు, మార్చి 3 : జిల్లాలోని దేవదుర్గ తాలూకా అప్రాళ గ్రామ సమీపంలో కృష్ణ నది పై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం ద్వారా గణేకల్(బంగారప్ప చెరువు) రిజర్వాయర్ ఆధారంగా జరిగే సాగుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. ఆదివారం దేవదుర్గ తాలూకాలోని అప్రాళ గ్రామ సమీపంలో కృష్ణ నది పై నిర్మించే ఎత్తిపోతల పథకం పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఈ పథకం పూర్తైతే గణేకల్(బంగారప్ప చెరువు) రిజర్వాయర్‌కు ఎప్పటికప్పుడు సమృద్ధిగా నీరందుతుందన్నారు. దీంతో రిజర్వాయర్ పై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు ప్రయోజనం లభించడమేగాక రాయచూరు నగరానికి శాశ్వత తాగునీటి పరిష్కారం లభిస్తుందన్నారు. పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

మెరుగైన వైద్యసేవల కోసం ప్రభుత్వంతో చర్చలు

●సత్యసాయి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ సతీశ్ బాబు



ఒపెక్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, అధికారులతో చర్చిస్తున్న సతీశ్

రాయచూరు, మార్చి 3 : జిల్లా కేంద్రంలోని ఒపెక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమ ఫౌండేషన్ సిద్ధంగా ఉన్నట్లు సత్య సాయి ఫౌండేషన్ బాధ్యుడు డాక్టర్ సతీశ్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రభుత్వంతో త్వరలోనే చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సూచించిన మేరకు ఆదివారం అధికారుల బృందం నగరంలోని ఒపెక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శించింది. సతీశ్ బాబు నేతృత్వంలోని వైద్యుల బృందం ఒపెక్ ఆస్పత్రిని సందర్శించి ఇక్కడ రోగులకు అందుతున్న వైద్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు తదితర వివరాల గురించి స్థానిక డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటీల్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రవి బోసరాజు అభ్యర్ధన మేరకు ఒపెక్ ఆస్పత్రి నిర్వహణ కోసం సత్య సాయి ఫౌండేషన్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆస్పత్రిని సందర్శించిన సత్య సాయి ఫౌండేషన్ వైద్యుల బృందం ఇక్కడి వైద్య సౌకర్యాలు, పరికరాలు ఇప్పటి వరకు అందించిన సేవలు, భవిష్యత్తులో అవసరమైయ్యే అభివృద్ధి పనులకు సంబంధించి ఆస్పత్రి డీన్ రమేశ్, పాలక మండలి సభ్యులు, వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ సతీశ్ బాబు, 1970లో ప్రారంభమైన తమ ఫౌండేషన్ విద్యవైద్య సేవలకే తొలి ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వంతో తమ సంస్థకు ఒప్పందం జరిగితే వైద్యసేవల మెరుగు కోసం ప్రామాణికంగా ప్రయత్నిస్తామన్నారు.

హోసూరు జోన్

రైతులకు ఆత్మ ప్రాజెక్టుపై శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

హోసూరు, మార్చి 3: వ్యవసాయశాఖ ఆత్మ ప్రాజెక్టు క్రింద కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై ఆదివారం ఒకరోజు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర విస్తరణ పథకాల సబ్సిడీ పునరావాస పథకం క్రింద సూడగొండపల్లి గ్రామంలో రైతులకు అవగాహన శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ భువనేశ్వరి పాల్గొని సబ్సిడీ పథకాలు, సహజ తెగుళ్ళ, వ్యాధుల నియంత్రణలో సాంకేతిక పద్ధతులు, మట్టి నమూనా సేకరణలో సాంకేతిక పద్ధతులు, వర్మీకంపోస్ట్ ఉత్పత్తి, ఎరువు వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారిణి రేణుక భూసారాన్ని పెంపొందించేందుకు సూక్ష్మపోషక ఎరువులు, జీవామృతం వాడకం, నాణ్యమైన విత్తనాల ద్వారా పంట దిగుబడిని పెంచడం, సూడోమోనాస్, వంటి వాటి వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. అదియమాన్ వ్యవసాయ కళాశాల అత్తిముగం అసిస్టెంట్ ప్రొఫెసర్ హరీష్ వేసవిలో కలిగే ప్రయోజనాలు, కృత్రిమ ఎరువులకు బదులుగా సహజ ఎరువులు వాడటం ద్వారా దిగుబడిని పెంచే సాంకేతిక పద్ధతులు, పంచగవ్య, జీవామృతం, సులభంగా కంపోస్ట్ చేసే పద్ధతులను వివరించారు. పసుపు ల్యాంప్ ట్రాప్ ద్వారా హానికరమైన కీటకాలను ఎలా నియంత్రించవచ్చో తెలిపారు.

హోసూరులో 68 చోట్ల పోలియో శిబిరాలు

హోసూరు(మత్తిగిరి) మార్చి 3: హోసూరు నగరంలో 68 చోట్ల పల్స్ పోలియో శిబిరాల ద్వారా సుమారు 20 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదివారం యునిసెఫ్, అంతర్జాతీయ రోటరీ అసోసియేషన్లు పోలియో చుక్కల టీకా శిబిరాలను నిర్వహించాయి. మరో రెండు రోజులపాటు నగరంలోని 45 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అవసరమైన వారికి పోలియో చుక్కలు వేయనున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలోని అప్పావునగర్ ఏరియాల్లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ఆరోగ్య కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, జోనల్ వార్డ్ ఛైర్మెన్ రవి, కౌన్సిలర్లు పార్వతి, వెంకటేశ్, సిటీ ఆరోగ్య శాఖ అధికారి ప్రభాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, మారిముత్తు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

హోసూరు, మార్చి 3: హోసూరు తాలూకా బాగలూరు సమీపం చొక్కరసనపల్లి గ్రామంలో వేణుగోపాలస్వామి దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రథోత్సవం ఘనంగా జరిగింది. యజ్ఞాలు, హోమాలు, గ్రామదేవతలకు పూజలు, నవగ్రహ పూజలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాగాయి. స్వామి వారికి పంచామృత అభిషేకం, అనంతరం పుష్పాలంకరణ చేశారు. నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీనరసింహ హోమం, మహా సుదర్శన హోమం, శాంతి హోమం నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాలైన సర్జాపుర, అత్తిబెలె తదితర పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు.



చట్ట సభల్లో పెరగనున్న మహిళల ప్రాతినిధ్యం



ప్రసంగిస్తున్న సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్

రాయచూరు, మార్చి 3: జనాభాలో సగ భాగమున్న మహిళలు అన్ని రంగాల్లో మరింత రాణించాలని రాయచూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ కోరారు. 2028-29వ ఆర్థిక సంవత్సరం అనంతరం దేశంలోని లోకసభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడంతో పాటు వారి గొంతు మరింత సమర్థవంతంగా వినిపించే అవకాశం ఏర్పడిందన్నారు. జిల్లా వీరశైవ సమాజం, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రంగ మందిరంలో నిర్వహించిన అక్కమహాదేవి ప్రశస్తి ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అక్కమహాదేవి అవార్డులను అందజేశారు. ఇదే సమయంలో తాలూకా స్థాయి వీరశైవ మహిళా సమాజం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన సిటీ ఎమ్మెల్యే పెరగనున్న ప్రాతినిధ్యంతో మహిళలు తమ సమస్యలను మరింత బలంగా ప్రస్తావిస్తూ అన్ని రంగాల్లో రాణించేందుకు ఐక్యతతో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.


అర్హులైన వారందరికీ చుక్కల మందు : మంత్రి ఎన్ఎస్ భోసరాజు

రాయచూరు, మార్చి 3: జిల్లాలో 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కల మందును అందజేయాలని దీనిని తల్లిదండ్రులు దీన్ని బాధ్యతగా గుర్తించాలని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని కేఈబీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు మంత్రి చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ప్రతి చిన్నారికి పోలియో చుక్కల మందు అందించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. అదే సమయంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చుక్కల మందు వేయించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బులుసు సాంబమూర్తి (జయంతి)



బులుసు సాంబమూర్తి 1886 మార్చి 4న తూర్పుగోదావరి జిల్లా దుళ్ళ గ్రామంలో జన్మించారు. దేశ భక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర, విశాలాంధ్ర అనే పరమ లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేసిన కార్యశూరుడు. మద్రాసు శాసనసభకు 1937 నుంచి 1942వరకు స్పీకర్‌గా గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చారు. 'దాస్యం కంటే దారిద్ర్యం మేలు' అనే నినాదంతో తన సర్వస్వాన్ని దేశోద్ధరణకు సమర్పించిన ఈయన చివరిరోజుల్లో పేదరికం, అనారోగ్యంతో గడిపి 1958 ఫిబ్రవరి 2న పరమపదించారు. ఆయన గౌరవార్థం 2008లో కేంద్రప్రభుత్వం ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేసింది.

వివాల్డి (జయంతి)



ఆంటోనియో లూసియో వివాల్డి 1678 మార్చి 4న ఇటలీ దేశం వెనిస్‌లో జన్మించారు. రోమన్ కేథలిక్ క్రైస్తవ ధర్మగురువు. పాశ్చాత్య శాస్త్రీయసంగీతమైన బారూఖ్ శైలి ప్రసిద్ధ వాగ్గేయకారుడు. పియానో, చేంబర్, సింఫోని సంగీత వాద్యాలలో నిష్ణాతులు. ఫోర్ సీజన్స్ పేరిట వెలువడిన వయోలిన్ కృతులు ఎంతో పేరొందాయి. రెండు శతాబ్దాల అనంతరం ఆయన సంగీత కృతులు వెలుగులోకి వచ్చి ప్రాచుర్యం పొంది నేటికీ వినిపిస్తున్నాయి. 1741 జూలై 28న కన్నుమూశారు.

రోహన్ బోపణ్ణ (పుట్టినరోజు)



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు రోహన్ బోపణ్ణ 1980 మార్చి 4న బెంగళూరులో జన్మించారు. 2002 నుంచి ఇండియన్ డేవిస్‌కప్ జట్టు సభ్యుడిగా కొన సాగుతున్నారు. 2013లో డబుల్స్‌లో వరల్డ్ నెంబరు 3గా నిలిచారు. అసియమ్-ఉల్-హక్ ఖురేషితో కలసి పలు పోటీల్లో పాల్గొన్నారు. వీరి ద్వయం ఇండో-పాక్ ఎక్స్‌ప్రెస్‌గా పిలవబడింది. యూఎస్ ఓపెన్ వింబుల్డన్‌లో రన్నరప్‌గా నిలిచారు. 2012, 2016లలో ఒలింపిక్ గేమ్స్‌లో ఆడారు. 2017 ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విజేత. కర్ణాటక ప్రభుత్వంచే ఏకలవ్య పురస్కారం, ఇతర అవార్డులు పొందారు. 2023 ఖత్తర్ ఓపెన్‌లో మాథ్యూ ఎబ్డెన్‌తో కలసి టైటిల్ సాధించారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



వార్షికోత్సవంలో మాజీ ఎంపీ ఉగ్రప్ప తదితరులు

బొమ్మనహళ్ళి, మార్చి 3: దివ్యాంగులకు అండగా ఉంటున్న సమర్థనం పాఠశాల ఎంతో ఆదర్శనీయంగా ఉందని మాజీ ఎంపీ ఉగ్రప్ప అభిప్రాయపడ్డారు. సమర్థనం పాఠశాల వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగింది. వార్షికోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు చెందిన దివ్యాంగులకు సమర్థనం చేయూతనిస్తోందని కొనియాడారు. వైకల్యం ఒక శాపం కాదని దాన్ని అధిగమించేలా 27 సంవత్సరాల క్రితం నాగేశ్ ప్రారంభించారన్నారు. కాలక్రమంలో మహంతేశ్ బాధ్యతలు చేపట్టాక దశలవారీగా అభివృద్ధి చేశారన్నారు. దివ్యాంగులను విద్యకే పరిమితం కాకుండా క్రీడలు ఇతర రంగాలలో రాణించేలా ప్రోత్సహించారన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించినవారు ప్రముఖ సంస్థలలో రాణిస్తున్నారన్నారు. పాఠశాల సాధనలకు ప్రధానమంత్రి సహా పలువురి ప్రశంసలు లభించాయన్నారు. వార్షికోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగరాజ్, వెంకట శివారెడ్డి, సమర్థనం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి దుర్మరణం

అగళి, మార్చి 3 : రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి దుర్మరణం పాలయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా అగళి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి శివకుమార్(40) మృతిచెందినట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. ఏఎస్ఐ అందించిన వివరాల మేరకు మధుగిరి తాలూకా దొడ్డేరి హబిలి తిమ్మాపురం గ్రామానికి చెందిన సిద్దరాజు, శివకుమార్, శివన్నలు తిమ్మాపురం గ్రామం నుంచి అగళి మండలం మధూడి గ్రామానికి వెళ్తున్నారు. తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో అగళి మండలానికి దగ్గరలో ఉన్న నరసంబుది మలుపు దగ్గర సిద్దరాజు అతివేగంతో, అజాగ్రత్తతో ద్విచక్రవాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివకుమార్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దరాజు, శివన్నలకు రక్తగాయాలయ్యాయి. మృతుడు భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నలుగురు కార్మికులకు గాయాలు

రాయదుర్గం రూరల్, మార్చి 3: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలోని మల్లాపురం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. కర్ణాటకలోని అశోక సిద్ధాపురం గ్రామానికి చెందిన నలుగురు భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గంగన్న, నాగరాజు, వసంత్‌రాజు అనే నలుగురు భవన నిర్మాణ కార్మికులు రాయదుర్గంలో పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నారు. అశోక్ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మల్లాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో నలుగురికి నలుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం గంగన్న, నాగరాజు, వసంతలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోలియోను సమూలంగా నిర్మూలిద్దాం

» రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో



శిడ్లఘట్టలో పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, మార్చి 3: పోలియో రహిత సమాజం కోసం ప్రజ లంతా తమ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే రవికుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని మేలూరు గ్రామపంచాయతీలో ఆదివారం ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధిగా మిస్బా, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్, ఉపాధ్యక్షులు శివానంద్ పాల్గొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అన్ని గ్రామాలలోనూ ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఉమేశ్, కార్యనిర్వహణాధికారి మునిరాజు, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్ మూర్తి, ప్రభుత్వ ఆసుపత్రి పాలనా వైద్యాధికారి మనోహర్, స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారి నౌతాజ్, డాక్టర్‌లు రమేశ్, విజయ్‌కుమార్, గ్రామపంచాయతీ సభ్యులు రవిప్రసాద్, బచ్చేగౌడ, భాగ్యమ్మ, ఎంజే శ్రీనివాస్, పీడీఓ శారదా, నటరాజ్, దేవరాజ్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: జాతీయ పల్స్ పోలియోలో భాగంగా తాలూకాలో ఆదివారం పలు చోట్ల పల్స్ పోలియో కార్యక్రమం సాగింది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాలూకా ఆరోగ్యశాఖ అధికారి సీ సత్యనారాయణరెడ్డి పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. పోలియో నివారణకు రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కాగా గ్రామాలలోనివారి కోసం మరో మూడు రోజులపాటు ఇంటి వద్ద సర్వే చేయించి పోలియో చుక్కలు వేసే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. తాలూకాలోని అన్ని ఆసుపత్రులు, పాఠశాలల్లోనూ, పురసభ, బస్టాండ్, తాలూకా, జిల్లా పంచాయతీ సహా 12 చోట్ల పోలియో చుక్కలు వేసేలా వ్యవస్థ జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా సమీపంలోని కేంద్రం వద్ద పోలియో చుక్కలు వేయించాలని కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పీయూ కళాశాలలో ఆదివారం ఏర్పాటైన పల్స్‌పోలియోను ప్రారంభించి మాట్లాడారు. పోలియో రహిత సమాజంకోసం మూడు దశాబ్దాలక్రితం కాంగ్రెస్ ప్రభుత్వం పల్స్ పోలియో చేపట్టిందని అప్పటి నుంచి ఏటా కొనసాగుతోందన్నారు. పోలియో రహిత సమాజమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తాలూకా వైద్యాధికారి ప్రియదర్శిని, ఏఎం భారతి, తాలూకా పంచాయతీ ఈఓ రవికుమార్, ఆరోగ్యశాఖ సిబ్బంది అనితా, ఆదర్శ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురలో...

విజయపుర: దేశంలో మూడు నాలుగు సంవత్సరాలుగా ఎటువంటి పోలియో కేసులు కనిపించడం లేదని ఇప్పటికే పోలియో నిర్మూలన దేశంగా ప్రకటించబడిందని అయితే పూర్తిస్థాయిలో పోలియో లేకుండా చేయాల్సి ఉందని విజయపుర పట్టణ సముదాయ ఆరోగ్యకేంద్రం పాలనా వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ అభిప్రాయపడ్డారు. సముదాయ ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్యశాఖ, రోటరీ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియోను ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. రోటరీసంస్థకు చెందిన బసవరాజు మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్వసహాయకుల పాత్ర కీలకమన్నారు. రోటరీ సంస్థ అధ్యక్షురాలు మంజుళా, పురసభ అధ్యక్షురాలు విమలా బసవరాజు, ఉపాధ్యక్షుడు కేశవప్ప, సముదాయ ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



భాగేపల్లిలో తాలూకా ఆరోగ్య అధికారి సత్యనారాయణరెడ్డి...



బంగారు పేటలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి



విజయపురలో పోలియోచుక్కలు వేస్తున్న రోటరీ అధ్యక్షురాలు మంజుల

ఖర్గే స్థానంలో అల్లుడు రాధాకృష్ణ

» కుటుంబంలో మరో వ్యక్తి క్రియాశీలకం



రాధాకృష్ణ

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే సొంత నియోజకవర్గాన్ని అల్లుడు రాధాకృష్ణ దొడ్డమనికి అప్ప గించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. సుదీర్ఘకాలంగా కలబురగి లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందుతూ వచ్చిన మల్లికార్జున ఖర్గే 2019 ఎన్నికల్లో శిష్యు డు ఉమేశ్‌జాధవ్ చేతిలో ఓటమి చెందారు. ప్రస్తుతం మల్లికార్జున ఖర్గే రాజ్య సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. రానున్న ఎన్నికల్లో ఆయన కలబురగి నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపడం లేదని తెలుస్తోంది. ఈ మేరకు ఖర్గే అల్లుడు రాధాకృష్ణను రాజకీయాల్లోకి తీసుకొచ్చేందుకు కసరత్తు సాగు తోంది. ఇటీవలే జిల్లాకు చెందిన వైద్యవిద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ బెంగళూరులో కలబురగి జిల్లా ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశం జరిపారు. ఖర్గే ఉన్నత స్థానంలో ఉన్నారని ఆయనను మరోసారి కలబురగి నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ వద్దని, ఆయన స్థానంలో అల్లుడు రాధాకృష్ణ అభ్యర్థి అవుతారని సమష్టిగా పనిచేసి గెలుపు సాధిద్దామని సూచించారు. ఖర్గేకు 83 ఏళ్ల వయసు అయినందున నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించడం కష్టతరం కానుందని, ఆయన దేశవ్యాప్తంగా ప్రచారానికి వెళ్లాల్సి ఉంటుందని చర్చించారు. మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక ఖర్గే రాష్ట్ర కేబినెట్‌లో కీలకమైన పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి, ఐటీబీటీ శాఖల మంత్రిగా వ్యవహరి స్తున్నారు. ఆయనకు జాతీయ రాజకీయాల వైపు వెళ్లే ఆసక్తి కూడా లేదు. కలబురగి నుంచి రాధాకృష్ణకు టికెట్ ఇచ్చే విషయమై కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ లతోనూ చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మంచి వాతావరణం ఉందని గ్యారెంటీలపట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని గెలుపు సాధ్యం కానుందని హైకమాండ్‌కు రాష్ట్రనాయకులు విన్నవించినట్లు తెలుస్తోంది. రాధాకృష్ణ పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ముఖ్యు లుగా వ్యవహరిస్తున్నారు. బెంగళూరు, కలబురగిలలో అంబేడ్కర్ విద్యాసంస్థలను పర్యవేక్షిస్తున్నారు.

పేలుళ్లకు ప్రభుత్వ వైఫల్యమే కారణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, మార్చి 3: రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్లకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని, పాలనా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని మాజీ మంత్రి అరవింద లింబావళి ఆరోపించారు. కుందలహళ్ళిలోని రామేశ్వరం కెఫె పేలుళ్ల బాధితులను ఆదివారం పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే మంజుళాతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు ప్రజలను బెంబేలెత్తించేలా ఉంటాయని, ఉగ్రవాద కార్యకలాపాలకు అవకాశం ఇవ్వరాదన్నారు. ఘటనను ఎన్ఐఏ దర్యాప్తుకు అప్పగించాలన్నారు. కాగా విధానసౌధ వద్ద పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా నిర్లక్ష్యాన్ని వీడి ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు.

వినికిడి సమస్యలకు ఉచిత శిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు, నిర్వాహకులు

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శ్రవణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జేపీనగర్‌లోని నాయక్స్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌లో ఉచిత శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. కర్ణాటక లోక్‌సేవా కమిషన్ మాజీ సభ్యురాలు, దివ్యాంగ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ మంగళా శ్రీధర్ ప్రారంభించారు. వాల్మీకి మహాసభ అధ్యక్షుడు సిరిగేరి తిప్పేశ్, నాయక్స్ క్లినిక్ ముఖ్యులు ఎంఎస్‌జే నాయక్, ఎన్‌రిచ్ రిహాబిలిటేషన్ ట్రస్టు ముఖ్యులు మోహన్‌కుమార్ పాల్గొన్నారు. ఈఎన్‌టీ స్పెషలిస్ట్ పురుషోత్తమ మాట్లాడుతూ తరచూ వినికిడి సమస్యలు ఉన్నవారు నిపుణుల సలహాలు పాటించాలన్నారు. డాక్టర్ మంగళా శ్రీధర్ మాట్లాడుతూ చెవికి సంబంధించిన సమస్యలపై సమాజంలో అవగాహన తక్కువన్నారు. నిర్లక్ష్యం చేస్తే వినికిడి కోల్పోయే అవకాశం ఉందన్నారు. శ్రవణ దినోత్సవం సందర్భంగా ఉచిత శిబిరాన్ని కొనసాగిస్తున్నామని ఎస్‌జే నాయక్ తెలిపారు. ప్రతి మంగళవారం పిల్లలకు ఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు.

కార్మికులకు వైద్య శిబిరం



శిబిరంలో కార్మిక విభాగ ప్రముఖులు

బొమ్మనహళ్ళి, మార్చి 3: నియోజకవర్గంలోని పలు చోట్ల కట్టడ కార్మిక సంఘం బెంగళూరు దక్షిణ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అరికెరె ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 4.30వరకు కొనసాగింది. బొమ్మనహళ్ళి బ్లాక్ లేబర్‌సెల్ అధ్యక్షుడు ఓబులేశు శిబిరాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో బీపీ, షుగర్ సహా అన్ని రకాల వాటికి అన్ని రకాల పరీక్షలు చేశారు. కార్మికులకోసమే శిబిరం నిర్వహించడం విశేషం. సుమారు 150మంది శిబిరం ప్రయోజనాలు పొందారు. సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకోసం పలు సంక్షేమాలు అమలు చేస్తోందన్నారు. ఒకసారి కార్మికశాఖ సభ్యత్వం పొందితే పలు ప్రయోజనాలు ఉంటాయన్నారు. కేపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర, ఉమాపతిగౌడ, అశ్వత్థనారాయణస్వామి, లోకేశ్, ఓబులేశు, సోము, అంబరీశ్, అసీన్‌పీరా, సుబ్రమణ్యం, ఖాసిం, శ్రీనివాస్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బ్రాండ్ బియ్యానికి భలే డిమాండ్..



బియ్యం కోసం క్యూలో వేచియున్న ప్రజలు

చింతామణి, మార్చి 3: కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భారత్ బ్రాండ్ బియ్యానికి డిమాండ్ ఏర్పడింది. పట్టణంలోని చేళూరు రోడ్డులోని కేఎండీ కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ప్రజలు క్యూలో వేచి ఉండి బియ్యం కొనుగోలు చేశారు. బియ్యం కిలో రూ.29 కాగా పదికిలోల బియ్యం ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచారు. 3వేల బియ్యం ప్యాకెట్‌లను కేవలం మూడు గంటల్లో ఖాళీ కావడం విశేషం. బీజేపీకి చెందిన ప్రముఖుడు మాడికెరె అరుణ్ మాట్లాడుతూ కోలారు జిల్లా బంగారపేటకు చెందిన మంజునాథ్ సదరు ఏజెన్సీ పొంది ఇక్కడ పంపిణీ చేశారన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా మరింత సరఫరా చేయాల్సి ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

కార్మికుడి మృతి



సుహేల్ (ఫైల్)

బాగేపల్లి, మార్చి 3: తాలూకాలోని నల్లపరెడ్డి గ్రామంలో ఇంటి వైరింగ్‌కోసం మిషన్‌తో గోడను కట్ చేస్తున్న వేళ కార్మికుడు సుహేల్ (26) మృతి చెందాడు. గోడ కటింగ్ వేళ మిషన్ రివర్స్ కావడంతో మిషన్ అతడి గొంతుకు తగిలింది. చూస్తుండగానే తీవ్ర రక్తస్రావంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సుహేల్ ఆకస్మిక మృతి కారణంగా అతడి కుటుంబంలో విషాదం నెలకొంది.

గ్యారెంటీలతో రాష్ట్రంలో మార్పు : సీఎం



చిక్కమగళూరు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలవేళ ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో మార్పు తెచ్చామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. చిక్కమగళూరులో ఆదివారం గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కాంగ్రెస్‌పై ఉంచిన ప్రజల నమ్మకాన్ని అమలు చేశామన్నారు. చిక్కమగళూరులోని నేతాజి సుభాష్‌చంద్రబోస్ జిల్లా మైదానంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు పలు కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఐదేళ్లపాటు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. గ్యారెంటీ పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చామన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేజే జార్జ్, మాజీ మంత్రి మోటమ్మ, ఎమ్మెల్యేలు నయన మోటమ్మ, ఆనంద్‌కుమార్, రాజుగౌడ, శ్రీనివాస్, తమయ్యగౌడ జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ల కోసం ప్రత్యేక కేంద్రం



ప్రాజెక్టు ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేదాంత సీనియర్ లివింగ్, ఎంజే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంయుక్తంగా రెట్రో లివింగ్ కోసం వేదాంత అనుగ్రహంను లాంఛనంగా ప్రారంభించారు. వసతి, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో 20ఏళ్ల అనుభవం ఉన్న ఎంజే సంస్థ, వేదాంత సీనియర్ లివింగ్‌తో కలసి దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్‌ల కోసం ప్రత్యేకమైన కేంద్రాలను ఏర్పాటు చేయదలిచింది. ఎంజే ఇన్‌ఫ్రా సీఎండీ డాక్టర్ పి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీనియర్ల జీవనశైలిని సుఖసంతోషాలతో ఉండేలా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిగణిలో రూ.100కోట్ల పెట్టుబడితో అనుభవం ప్రాజెక్టును అభివృద్ధి చేశామన్నారు. భావనాత్మక, ఆధ్యాత్మిక, యోగ క్షేమాలకు అనుకూలంగా కేంద్రం ఉందన్నారు. సంస్థ కో ఫౌండర్ రాహుల్ సభ ర్వాల్, అనుభవం ముఖ్యులు కేవీ బాబు తదితరులు పాల్గొన్నారు.


గీతా ఆన్ స్టాంప్స్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ఎస్ రాజేంద్రకుమార్, రచయిత మాదిరాజు లోకేశ్వరరావు తదితరులు

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖ మాజీ ఉన్నతాధికారి మాదిరాజు లోకేశ్వరరావు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి భగవద్గీతపై వచ్చిన స్టాంపులను సేకరించి పుస్తకరూపం కల్పించారు. ఈ పుస్తకావిష్కరణ జీపీఓలో జరిగింది. పుస్తకాన్ని కర్ణాటక సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎస్ రాజేంద్రకుమార్ లాంఛనంగా విడుదల చేశారు. భగవద్గీతలోని అనేక అంశాలపై వెలువడిన అపురూప స్టాంపులను పుస్తకరూపంలోకి తీసుకురావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా పుస్తక రచయిత ఎం లోకేశ్వరరావు మాట్లాడుతూ ప్రారంభ ఆఫర్‌గా 203 పేజీల పుస్తకాన్ని రాయితీధరకే అందిస్తున్నామన్నారు. ఈ పుస్తకానికి మోడ్రన్ మేనేజిమెంట్ ది గీతా వే అని పేరు పెట్టామని, భగవద్గీతలోని 180 శ్లోకాలను ఇందులో పొందుపరిచామన్నారు. స్టాంప్ కలెక్షన్ ప్రియులకు ఈ పుస్తకం అపురూపం కానుందన్నారు. భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలను స్పృశిస్తూ పుస్తకానికి కొత్త రూపం ఇచ్చామన్నారు. ఈ మేరకు మాదిరాజు లోకేశ్వరరావు నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉత్సాహంగా జాగృతి పరుగు



పరుగులో పాల్గొన్న ప్రజలు

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న స్మార్ట్ లిఫ్ట్, మొబిలిటీ వరల్డ్ 2024 ప్రదర్శనలో భాగంగా ఎలివేటర్ సేఫ్టీ అవేర్‌నెస్ రన్ శనివారం నిర్వహించారు. ఈ పరుగును విర్గో కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అనితా రఘునాథ్ లాంఛనంగా ప్రారంభించారు. ఎలివేటర్‌లు, లిఫ్ట్‌లను వినియోగించే సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఈ పరుగు నిర్వహించామన్నారు. మొత్తం మూడు విభాగాల్లో నిర్వహించిన పరుగులో 1500మందికిపైగా పాల్గొన్నారు. ప్రత్యేకించి 2024 మంది జాతీయ పతాకం రూపంలో బృందంగా ఏర్పడ్డం అందరినీ ఆకర్షించింది. ఈ ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. దేశ విదేశాలనుంచి వందమంది ఎగ్జిబిటర్‌లు ప్రదర్శనలో పాల్గొన్నారు. జాగృతి పరుగు సహా ప్రదర్శన విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.